# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 18, ఫిబ్రవరి 2026


## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం

# పకడ్బందీగా చేపట్టాలి

★ రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త







ప్రత్యేక సమగ్రత సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోల్ అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, తహసిల్దార్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా మ్యాపింగ్ చేయాలని, బూత్ స్థాయి అధికారుల ఖాళీలను భర్తీ చేయాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం సేకరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ మిగతా 2లో..



# సేవాలాల్ చూపిన మార్గం అందరికీ మార్గదర్శకం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

సంత్ సేవాలాల్ చూపిన మార్గం అందరికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో గిరిజన సంక్షేమ శాఖ, సేవాలాల్ జయంతి నిర్వహణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సద్గురు సంత్ సేవాలాల్ 287వ జయంతి కార్యక్రమానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన బోగ్ బండార్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో నడుద్దామన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని, బంజారా సమాజాభివృద్ధికి విశేష కృషి చేశారని, భారతీయ సామాజిక సంఘ సంస్కర్తగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. గిరిజనులు మిగతా 2లో..



# విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

✯ నూతన గ్రంథాలయం ప్రారంభం ✯ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త





అదునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి భవిష్యత్తును వెలిగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ బాణోత్ కావేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, డిఆర్‌డిఏ పీడీ రవీందర్ రాథోడ్, అదనపు కలెక్టర్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ పుల్లారావ్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావ్, మాజీ జడ్పీటీసీ బ్రీజులాల్, కాంతారావ్ దుర్గే, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సత్యం, విటిడిఏ చైర్మన్ దిగంబర్ ఆడే, దళిత రత్న కోర్రల మహేందర్, ఎంఐఎం అధ్యక్షులు షకీబ్ ఖాన్, హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు సుల్తాన్ ఖాన్, పలువురు సర్పంచులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# భార్య చేతిలో భర్త హత్య!

✹ మెడపై కత్తిపోట్లు ✹ ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి.. మార్గమధ్యంలో మృతి

✹ డబ్బుల గొడవే కారణమా?

✹ శాంతినగర్‌లో కలకలం

2లో..

– మందమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



# యువతి ఆత్మహత్య సంచలనం..

● కుటుంబ కలహాలా..? ప్రేమ విఫలమా..?

● నూతన జీవితం ఆశించిన యువతి..

ఉరితో ముగిసిన జీవితం





మందమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలో మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఓ విషాద ఘటన స్థానికులను కలవరపరిచింది. గదిలో మెడకు ఉరి వేసుకుని యువతి మృతి చెందిన ఘటన సంచలనంగా మారింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిగతా 2లో..

# మంచిర్యాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం





**ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సహకారంతో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం**

**మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయం**

**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ ధర్ని మధుకర్**

## ప్రభాతవార్తతో.. ముఖా ముఖి



నస్పూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

*మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ మేయర్ ధరణి మధుకర్ నగర సమగ్ర అభివృద్ధిపై తన కార్యాచరణను ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మార్గనిర్దేశంలో, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నగరాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని ధీమా వ్యక్తం చేశారు. నగరంలో నెలకొన్న తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామని వెల్లడించారు. గత రెండున్నరేళ్లుగా 32వ డివిజన్‌లో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు ప్రత్యర్థులు ఆరోపణలు చేసినా, ప్రజలు భారీ మెజార్టీతో తనను గెలిపించి తగిన సమాధానం చెప్పారని గుర్తుచేశారు. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయన ప్రభాతవార్తతో ముఖాముఖీ.. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..*

### ప్రేమ్‌సాగర్‌రావు నాయకత్వమే స్ఫూర్తి..

రాజకీయ ప్రయాణం 2011లో ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో ప్రారంభమైంది. ఆయన విజన్, సేవా దృక్పథం నన్ను రాజకీయాల వైపు నడిపించాయి. తొలి మేయర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, 32వ డివిజన్ ప్రజలకు, 60 మంది కార్పొరేటర్లకు కృతజ్ఞతలు. అందరినీ సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధికి కృషి చేస్తా. గత పాలకులు నస్పూర్, మంచిర్యాల ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. ఆ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

నస్పూర్‌లో ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డును సింగరేణి సంస్థ సహకారంతో నివాస ప్రాంతాలకు దూరంగా తరలిస్తాం. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయడం వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తాం. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.

### ఉపాధి, సంక్షేమ పథకాలే ధ్యేయం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు చేరేలా చూస్తాం. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను కలిసి నగరానికి మరిన్ని నిధులు తీసుకొస్తాం. వేంపల్లి ఇండస్ట్రియల్ హబ్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సింగరేణి ఓసీపీల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తాం. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.

### ఆదాయ వనరుల పెంపు

కార్పొరేషన్ ఆర్థిక స్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలపై భారం పడకుండా ఆదాయ వనరులను పెంచే మార్గాలను అన్వేషిస్తామని మేయర్ పేర్కొన్నారు.

### స్వచ్ఛ మంచిర్యాల పచ్చని నగరం

పట్టణ సుందరీకరణలో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమని, అన్ని వార్డుల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటామని ధర్ని మధుకర్ చెప్పారు. చెత్త నిర్వహణలో ఆధునిక విధానాలను అన్వేషించి అమలు చేస్తామని, పర్యావరణ నిపుణుల సలహాల మేరకు పట్టణమంతటా పచ్చదనం పెంపొందిస్తామని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యంపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

తెలంగాణ రాష్ట్రం మొత్తం మంచిర్యాల వైపు చూసేలా, రాబోయే ఐదేళ్లలో అన్ని రంగాల్లో నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపడమే నా ఆశయం. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో గెలిపించిన ప్రజల అంచనాలకు తగ్గట్టుగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని, నగర అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములై సహకరించాలని కోరారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆ దిశగా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఇంటిని సందర్శించి సమాచారం సేకరిస్తున్నారని తెలిపారు. ఓటరు జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని, మ్యాపింగ్ ప్రక్రియలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితా సమర్పించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఫారం 6, 7, 8 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సేవాలాల్ చూపిన మార్గం అందరికీ మార్గదర్శకం

(మొదటిపేజీ తరువాయి)

విభిన్న సంస్కృతి, సాంప్రదాయాలను కలిగి ఉంటారని తెలిపారు. సంత్ సేవాలాల్ కేవలం బంజారాలకే కాకుండా యావత్ ప్రజలందరికీ ఆదర్శ పురుషుడిగా ఆచరణీయ మార్గాన్ని అనుసరించారని, మహానుభావులు ఇచ్చిన స్ఫూర్తితో దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో బంజారా భవన్, సేవాలాల్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృుతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, బంజారా పెద్దలు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భార్య చేతిలో భర్త హత్య!

మందమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

మందమర్రి పట్టణం శాంతినగర్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన దారుణ ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. భార్య చేతిలో భర్త కత్తిపోట్లకు బలైన సంఘటన పట్టణంలో తీవ్ర సంచలనం రేపుతోంది. మృతుడు ఎం.డి. మోయిన్ (42), తండ్రి ఖాసీం, వృత్తి డ్రైవర్. సుమారు పదేళ్ల క్రితం చుక్కల అవంతి (41)తో మతాంతర వివాహం చేసుకున్నాడు. అయితే కుటుంబంలో డబ్బుల విషయంలో తరచూ కలహాలు జరుగుతున్నట్లు సమాచారం. చిన్న చిన్న వివాదాలు క్రమంగా తీవ్ర స్థాయికి చేరినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. మంగళవారం రోజున ఉదయం సుమారు 5 గంటల సమయంలో ఇంట్లో మరోసారి గొడవ చెలరేగినట్లు తెలుస్తోంది. ఆవేశానికి లోనైన అవంతి, ముందుగానే సిద్ధం చేసుకున్న కత్తితో భర్త మోయిన్ మెడపై పలుమార్లు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మెడపై లోతైన గాయాలు కావడంతో మోయిన్ తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. ఇంటి లోపల రక్తపు మడుగులో పడి ఉన్న దృశ్యం చూసిన స్థానికులు భయంతో ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న మందమర్రి పట్టణ ఎస్సై జి. నరేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న మోయిన్‌ను 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే అతను ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో శాంతినగర్ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పది సంవత్సరాల దాంపత్య జీవితం చివరకు రక్తపాతం తో ముగియడం స్థానికులను కలవరపరిచింది. కుటుంబ వివాదాలు ఎంతటి దారుణానికి దారితీస్తాయో ఈ సంఘటన మళ్లీ నిరూపించిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మృతుడి తల్లి ఎం.డి. ఫైజియా బేగం ఫిర్యాదు మేరకు మందమర్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తులో వెలుగులోకి రానున్నాయి.

## యువతి ఆత్మహత్య సంచలనం..

(మొదటిపేజీ తరువాయి)

కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి తల్లి తోకాలి ముత్తమ్మ (45), నివాసం ఆకినపెట్ల సోమగూడం, తన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం తన కూతురు బంగారి పావని (24)కు ఆరు సంవత్సరాల క్రితం కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన బంగారి సతీష్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. అయితే గత రెండు సంవత్సరాలుగా దాంపత్య విభేదాల కారణంగా పావని తన పిల్లలతో కలిసి తల్లి వద్దే నివసిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పావని, ఠాకూర్ సంగం సింగ్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుని, గత 15 రోజులుగా మందమర్రిలో అతనితో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 17న ఉదయం సుమారు 9 గంటల సమయంలో సంగం సింగ్ అప్రెంటిస్ పనుల కోసం బయటకు వెళ్లి, మధ్యాహ్నం సుమారు 12 గంటలకు తిరిగి వచ్చాడు. గది తలుపు లోపల నుంచి మూసి ఉండటంతో అనుమానం వచ్చిన అతడు కిటికీ ద్వారా చూడగా, పావని ఇనుప రాడుకు చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. అతడు వెంటనే తలుపు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చున్నీని కత్తిరించి కిందకు దించి, నోటితో శ్వాస ఇవ్వడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకున్నాడు. అనంతరం ఈ విషయాన్ని మృతురాలి తల్లికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం, ఫిబ్రవరి 13న పావని, సంగం సింగ్ ఇద్దరూ మంచిర్యాలలో తమ ఇంటికి వచ్చినప్పుడు పిల్లలను తన దగ్గరే ఉంచాలని, వారిద్దరి భవిష్యత్తుపై మాట్లాడినట్లు తెలిపారు. అయితే ఆ విషయమై స్పష్టత రాకముందే ఈ విషాదం చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై మందమర్రి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆత్మహత్యా? లేక మరేదైనా కారణమా? అన్న దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లలతో కలిసి కొత్త జీవితం ప్రారంభించాలని భావించిన యువతి ఇలా అకాల మృతికి గురవడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**జన్నారం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

జన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారామ్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సులవ జనార్ధన్‌ల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను మంగళవారం రోజు ఘనంగా నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,చేపట్టిన అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. అబద్ధపు హామీలతో గద్దనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని, మునుముందు తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా ఎగరవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముమ్మాటి సంతోష్, సుతారి వినయ్,జాడి గంగాధర్,భరత్ కుమార్, చెటుపెల్లి సత్యం, శ్రీనివాస్ గౌడ్, సాయిని ప్రసాద్ నేత,తదితరులు పాల్గొన్నారు.

**వేమనపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్, మాజీ కో ఆప్షన్ సభ్యులు హమీద్ ఖాన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు, పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేసిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం సుధాకర్, కొప్పుల మధునయ్య, గురుండ్ల వసంత్, ప్రదీప్, నాగేష్, సురేష్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

లక్షెట్టిపేటలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు మండల, పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజు స్థానిక ఐబి ఆవరణలో కేక్ కటింగ్ చేసిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన జాతిపిత కేసీఆర్ అని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, రైతుబంధు, రైతు బీమా లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు విజిత్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ తిప్పని లింగయ్య, శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు పెట్టంతిరుపతి, రాందేనీ జమున, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, గరిసె రవీందర్, సతీష్, ఇంతియాజ్, గుడ్డు, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



కేక్ కట్ చేస్తున్న బిఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు



కేకు తినిపించుకుంటున్న బిఆర్ఎస్ శ్రేణులు

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండల్ కోస్నీ గ్రామంలో ప్రాణహిత భవన్‌లో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, గోళం వెంకటేష్,మాజి ఎంపీపీ మాలతీ, మాజి కౌన్సిలర్ నక్క మనోహర్, దాసరి నరేందర్, మండల అధ్యక్షులు పర్వతి అంజన్న, నాయకులు వాసకే హనుమంత్, కార్యకర్తలు, అభిమానులు, టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**

తెలంగాణ జాతిపిత,బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కెసిఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు మంగళవారం ఐబీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలుకేక్ కట్ చేసి వృద్ధులు, ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుబ్బా దత్తుమూర్తి, నాయకులు దత్తాత్రేయరావు, ఎలుక రాంచందర్, చంద్రశేఖర్ పూసాల, ప్రణయ్ కుమార్ బోడ సతీష్, అబుసాద్, బాబుఖాన్, అర్జున్, అరవింద్, భీమ లింగయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర మొదటి, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక బీఆర్ఎస్ భవన్లో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్, బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. పలువురు మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన త్యాగాలను గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. అనంతరం ఆసుపత్రి కి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**దస్తురాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధకులు, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు దస్తురాబాద్ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని నాయకులు మండల కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముడికే ఐలయ్య యాదవ్, రాజు నాయక్, ఎండపెల్లి గంగన్న, చుంచోలి రాములు, అరుగుల రాజనర్సయ్య, మాణిక్యరావ్, శంకర్, విలాస్ యాదవ్ పాల్గొన్నారు. వీరితో పాటు గోపి, కిషోర్, విజయ్, రాజేందర్, రవి, తిరుపతి, రాజలింగు, శైలేందర్, గోపి, శివ, వంగల సాయి, మహేష్, రాము, శ్రీను, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



**సారంగాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. మండలవ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు కేసీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ దేవి శంకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ గారు నిండు నూరేళ్లు చల్లగా, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధిలో ఆయన ముద్ర చెరగనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శివారెడ్డితో పాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు ధనంజయ్, రవి, అల్లిశాబ్, గంగన్న, కృష్ణారావు, నడిపి భూమేష్, గంగరావు, లక్ష్మణ్, పెద్ద భూమేష్, గంగవ్వ, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నార్నూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధకులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు నార్నూర్ మండల కేంద్రంలో మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు.







కేక్‌కట్ చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు







# మిన్నంటిన కేసీఆర్ జన్మదిన వేడుకలు

**నేరడిగొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధకులు, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు నేరడిగొండ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగాయి. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు అనిల్ జాదవ్ యువ సైన్యం ఆధ్వర్యంలో ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద పార్టీ శ్రేణులు, యువ సైన్యం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జై కేసీఆర్, జై అనిల్ జాదవ్ నినాదాలతో నేరడిగొండ పురవీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో అనిల్ జాదవ్ యువ సైన్యం అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచులు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, విజయ్, శివారెడ్డితో పాటు పిఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, జహీర్, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.

**నేరడిగొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు బోథ్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో వినూత్నంగా జరిగాయి. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో వారి పంట పొలాల్లోనే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగానికి వెన్నుముకగా నిలిచిన కేసీఆర్ పట్ల రైతులు చూపిస్తున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివన్నారు. సాగునీరు, ఉచిత విద్యుత్, రైతు బంధు వంటి పథకాలతో రైతన్నకు భరోసా ఇచ్చిన కేసీఆర్ గారి నాయకత్వం మళ్ళీ కావాలని రైతులు కోరుకుంటున్నారని తెలిపారు. రైతుల కళ్లలో కనిపిస్తున్న ఈ ఆనందం, ధైర్యమే తెలంగాణలో మళ్ళీ "రైతు రాజ్యం" రాబోతుందనే దానికి నిదర్శనమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పొలాల మధ్య కేక్ కట్ చేసి, రైతులందరికీ మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోగులకు పండ్ల పంపిణీ..

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షులు డబ్బుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి బంగారు తెలంగాణగా మార్చారన్నారు. రైతుబంధుతో అన్నదాతకు వెన్నుముకగా నిలిచారని, నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకంతో మేనమామగా అండగా నిలిచారని కొనియాడారు. మిషన్‌భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొంగర్ల శారద రాజన్న, మాజీ ఫ్యాక్స్ డైరెక్టర్ చట్ల వినీల్, యువజన సంఘం సభ్యులు ప్రభాకర్, తరుణ్, సుకుమార్, నందు, విజయ్, రాజేందర్, సాయి తారక్ తదితరులు పాల్గొన్నారు.



**సిరికొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధకులు, తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు సిరికొండ మండల కేంద్రంలో మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. భారత రాష్ట్ర సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమైన ఒక మహాశక్తి అని కొనియాడారు. ఆయన పదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన రైతుబంధు, కళ్యాణ లక్ష్మి, మిషన్‌భగీరథ వంటి పథకాలు రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు చిరస్థాయిగా నిలిచిపోతాయని, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ఉద్ఘాటించారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ కేసీఆర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# నూతన పాఠశాల భవన నిర్మాణం

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**




మండలంలోని న్యూ అనంతపూర్ గ్రామంలో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 20 లక్షల వ్యయంతో మంజూరైన నూతన టిడబ్ల్యూపీఎస్ పాఠశాల భవనానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాఠశాలల మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, ముఖ్య నాయకులు నాణం రమణ, కొత్త శంకర్, అల్కే గణేష్, జాంసింగ్, గ్రామ సర్పంచ్ సీడం మాన్కుతో పాటు గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**నిర్మల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**




జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మండలాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇండ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు వెంటనే మార్కౌట్ పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి. నిర్మాణాలు మందగించిన చోట లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలి. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

**సారంగాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

నిర్మల్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరం చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా సారంగాపూర్, లక్ష్మణచాంద, నిర్మల్ రూరల్, దిలావర్‌పూర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా విద్యుత్ బిల్లుల్లో తలెత్తిన వ్యత్యాసాలు, కొత్త కనెక్షన్ల మంజూరులో జరుగుతున్న జాప్యం, లోవోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వంటి సాంకేతిక పరమైన సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా స్థాయి విద్యుత్ ఉన్నతాధికారులు స్వయంగా పాల్గొని ఈ ఫిర్యాదులను పరిశీలిస్తారని, సాధ్యమైనంత వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపడతారని చైర్‌పర్సన్ తెలిపారు. కావున నిర్మల్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## ప్రభుత్వ పథకాలపై వార్డు సభ్యులు అవగాహన పెంచుకోవాలి: ఎంపీడీవో అరుణ

**దస్తురాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పంచాయతీ వార్డు సభ్యులు పూర్తి అవగాహన పెంచుకుని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో అరుణ పిలుపునిచ్చారు. దస్తురాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వారు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టాలు, నిధుల వినియోగం, గ్రామీణాభివృద్ధి పథకాలపై సమగ్ర అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రమేష్ రెడ్డి, సూపరిండెంట్ గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన నీటిపారుదల ఈఈ

**తాండూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మంచిర్యాల జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ సత్య రాజచంద్ర బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర్ రెడ్డితో కలిసి పర్యటించారు. వట్టివాగు పై నిర్మిస్తున్న రక్షణ కట్ట పనులను ఈఈ పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలని నీటి పారుదల శాఖ సిబ్బందికి చెప్పారు. నీటి నిల్వ ప్రాంతం మైనింగ్ పరిధిని అధికారులు చూపించారు. వర్షాకాలం లోపు కట్ట నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అన్నారు. వ్యూ పాయింట్ నుండి కైరిగూడ ఓసిపి పని స్థలాలను పరిశీలించారు. జిఎం కార్యాలయంలో ఈఈ నీ ఏరియా జియం, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో కైరిగూడ పిఓ మచ్చగిరి నరేందర్, డీజీఎం (సివిల్) మధీనా బాషా, నీటిపారుదల శాఖ ఎస్ఈ విష్ణు ప్రసాద్, ఈఈ గుణవంత రావు, డీఈలు అన్నాజీ రావు, దామోదర్ అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

*** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**నస్పూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్‌లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కౌటాలలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**కౌటాల,ఫిబ్రవరి 17 ,ప్రభాతవార్త:**

కాగజ్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన శాహిన సుల్తానా చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడంతో కౌటాల లో కాంగ్రెస్ నాయకులు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు జానకిరావ్ మాట్లాడుతూ ఈ విజయం కాంగ్రెస్ రెండేళ్ల ప్రజాపాలనకు నిదర్శనం అని, ఈ విజయం వెనుక ఎమ్మెల్సీ దండే విట్టల్ కృషి ఎంతగానో ఉందని, కాంగ్రెస్ పథకాలకు ప్రజలు ఆకర్షితులై ఓటు వేశారని అన్నారు. ఇక ముందు జరగబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుడుపేట్ సర్పంచ్ భీమ్ రావ్, మండల నాయకులు నయీమ్, నీకోడె గంగారం, గట్టయ్య, కత్తెరసాల శంకర్, రామ్ కుమార్, నేతాజీ, సత్తయ్య, పోశం, కిషోర్ లు ఉన్నారు.

## లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు

**తాండూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయం సమీపంలో లీకేజీ అవుతున్న పైపులైన్‌కు మంగళవారం మరమ్మతులు చేశారు. పైప్ లైన్ లీకేజీ అవుతున్నదని స్థానికులు సర్పంచ్ ముడిమడుగుల సురేష్ దృష్టికి తెచ్చారు. దీంతో సర్పంచ్ పైప్ లైన్ లీకేజీలను పరిశీలించి దగ్గరుండి మరమతులు చేయించారు. దీంతో స్థానికులు సర్పంచు కృతజ్ఞతలు తెలిపారు.



## కాగజ్‌నగర్ మున్సిపాలిటీపై
# హస్తం జెండా..

**- కాంగ్రెస్ పథకాలకే ప్రజల పట్టం**

**- కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన శాహిన సుల్తానా ఎన్నిక కావడంతో మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనపై ప్రజలు నమ్మకంతో ఓటు వేశారని కొనియాడారు. ఎమ్మెల్సీ దండే విట్టల్ ప్రత్యేక చొరవ, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లడం వల్లే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారని తెలిపారు. ఇదే ఉత్సాహంతో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ చేస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, డుబ్బుల వెంకన్న, మాజీ సర్పంచ్ మేకల ప్రసాద్, బింకరీ నారాయణ, ఉప్పులం మహేష్, సత్యన్న మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# సీఎంపీఎఫ్ సేవలు జాప్యం లేకుండా అందిస్తాం

### - జీఎం రాధాకృష్ణ - సికేర్స్ పోర్టల్ ద్వారా పారదర్శక లావాదేవీలు: రీజినల్ కమిషనర్ హరి పచౌరి



మందమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

సీఎంపీఎఫ్ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు జాప్యం లేకుండా త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సీఎంపీఎఫ్, పెన్షన్‌కు సంబంధించిన అన్ని లావాదేవీలు సికేర్స్ పోర్టల్ ద్వారానే జరుగుతున్నాయని వివరించారు. కొత్తగా సీఎంపీఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్‌ను వేగవంతంగా పరిష్కరించేందుకు "ప్రయాస్" అనే విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ లక్ష్యంతో సీఎంపీఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్‌ను సెటిల్ చేస్తున్నామని పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సీఎంపీఎఫ్ సేవలను పొందవచ్చని, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 118 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ సెటిల్మెంట్ కాపీలను సంబంధిత అధికారులకు రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి అందజేశారు. ఫిబ్రవరి నెలలో పదవీ విరమణ చేయనున్న రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి నీ ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, ఏఐటీయూసి రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణతో పాటు అధికారులు, యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇదే సందర్భంలో కాంట్రాక్ట్ ఉద్యోగి కె. తిరుపతికి 2023 నుండి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పెన్షన్ మొత్తాలను ప్రయాస్ - సికేర్స్ పోర్టల్ ద్వారా తక్షణమే పరిష్కరించి, అతని ఖాతాలో జమ చేశారు. దీంతో ఆ ఉద్యోగి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రీజినల్ కమిషనర్-02 గోవర్ధన్, ఏఐటీయూసీ నాయకులు అక్బర్ అలీ, దాగం మల్లేష్, డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, గనుల సంక్షేమ అధికారులు, సీఎంపీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన ప్రచారంకు శ్రీకారం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:




బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక ప్రచారం కోసం శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ కే హరిత పేర్కొన్నారు. రైట్స్ ఫర్ చిల్డ్రన్, సూర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో "బాల్య వివాహము భారత్ - 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం" లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్ తో కలిసి ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రచార వాహనం మైక్ సదుపాయంతో జిల్లాలోని గ్రామాలు, మండలాలు, గిరిజన ప్రాంతాలలో పర్యటిస్తూ బాల్య వివాహాలపై అవగాహన కల్పించనుందన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వాటి నివారణ కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. బాల్యం ఎంతో విలువైన దశ అని, ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ హక్కులు కల్పించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహం చట్టపరంగా నేరమని, అలాంటి ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి బాల్య వివాహాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కాలేజీలు, గ్రామ సభలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన తండాలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి రమాదేవి డిసిపిఓ మహేష్ , డిహెచ్ఈడబ్ల్యు కోఆర్డినేటర్ శారద, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు సంతోష్ కుమార్, ప్రభు, దేవాజి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై ఐఎన్టీయూసీ కృషి

### ● ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు

నస్పూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



ఆర్.కె 7 గనిపై కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెట్టి శంకర్ రావు

మెడికల్ బోర్డు సమస్య పరిష్కారం, వడ్డీ లేని గృహ రుణాల హామీలను ప్రభుత్వం ద్వారా తక్షణమే అమలు చేయిమని ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 7 గనిపై పిట్ కార్యదర్శి రౌతు సత్యనారాయణ నేతృత్వంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి సహకరించిన సింగరేణి కార్మికులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో కార్పొరేషన్ పీఠాన్ని సాధించి రాష్ట్రానికే మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి భూపాలపల్లి సభలో ఇచ్చిన హామీల సాధన కోసం ఐఎన్టీయూసీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్మికుల అలవెన్సులపై విధిస్తున్న ఆదాయపన్నును రద్దు చేయించేందుకు కేంద్ర కమిటీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. 25 లక్షల రూపాయల వడ్డీ లేని గృహ రుణాల పథకాన్ని త్వరితగతిన అమలు చేయిస్తామని చెప్పారు. మారుపేర్లు, విజిలెన్స్ కోర్టు సమస్యలను పరిష్కరించి కార్మికులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని ప్రకటించారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్ సారథ్యంలో సమస్యల పరిష్కారం కోసం నేడు హైదరాబాద్ వెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకు ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ పోరాటం కొనసాగిస్తుందని జెట్టి శంకర్ రావు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు కలవేణి శ్యామ్, గరిగ స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, ల్యాగల శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఇరు వర్గాల ఘర్షణ కారణంగా రెండోసారి వాయిదా పడిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

### - ప్రత్యేక అధికారి సతీష్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

సోమవారం జరగాల్సిన క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో మంగళవారం నిర్వహించడానికి ప్రత్యేక అధికారి నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి బిఆర్ఎస్, సీపిఐ కౌన్సిలర్‌లు ముందు చేరుకోగా, మంత్రి వివేక్, ఎంపి వంశీ కృష్ణలతో కలిసి 7 గురు కాంగ్రెస్ కౌన్సిలర్‌లు హాజరయ్యారు. కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారం సజావుగానే సాగింది, కాగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా సమావేశం హాల్ నుంచి ఒక్కసారిగా కేకలు, అరుపులు వినబడగా, కౌన్సిలర్‌లు రక్షించాలని వేడుకొన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్‌లతో కలిసి, మంత్రి వివేక్, ఎంపి వంశీ కృష్ణలు సమావేశ గది నుండి బయటకు వెళ్లిపోయారు. అనంతరం అక్కడే ఉన్న బిఆర్ఎస్, సీపిఐ కౌన్సిలర్‌లు వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. కౌన్సిల్ హాల్‌లో బైటాయించి కలెక్టర్ రావాలంటూ డిమాండ్ చేశారు. ప్రత్యేక అధికారి స్థానిక తహశీల్దార్ సతీష్ మాట్లాడుతూ కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారం ప్రశాంత వాతావరణంలో జరిగిందని, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో ఇరు వర్గాల కౌన్సిలర్‌లు ఘర్షణ పడిన కారణంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ వాయిదాలను పరిశీలిస్తుంటే అధికారులు కావాలనే అధికార పక్షానికి పూర్తి స్థాయిలో, తమ సాయ శక్తుల సహాయ సహకారాలు అందజేస్తున్నారని పుర ప్రజలు చర్చించుకుంటున్నారు.



## ఆసిఫాబాద్ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తా

### - ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

ఆసిఫాబాద్ పట్టణ అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో అభివృద్ధి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా ఎండీ అహ్మద్ కి మంగళవారం పట్టణంలోని సందీప్ నగర్ (ఎస్సీ కాలనీలో) కాలనీవాసులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, బీజేపి ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, బీసీ సంఘం నాయకులు కోట వెంకన్న, కాలనీవాసులు సయ్యద్ అజార్, మాటూరి కుమార్, చిలుముల నితిన్, అచల్, మోతే జాన్, సిహెచ్ కిరణ్, ఏం ఆదిత్య , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్ ఫండ్స్ సంస్థలపై ఫిర్యాదుల స్వీకరణ

### - ఆదిలాబాద్ సహాయ చిట్స్ రిజిస్టార్ సోగాల చంద్రశేఖర్

నస్పూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కనకదుర్గ చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు అచల, భవితశ్రీ, అక్షర, శుభనందిని చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలలో చిట్టీ వేసి డబ్బులు తిరిగి పొందని ఖాతాదారులు తమకు రావలసిన డబ్బులు పొందుటకు గాను తమ వద్ద గల రసీదులు, తగిన ఆధారాలతో 7 రోజుల లోగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సహాయ చిట్స్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని ఆదిలాబాద్ సహాయ చిట్స్ రిజిస్టార్ సోగాల చంద్రశేఖర్ తెలిపారు.

# క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో హైడ్రామా..

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పై వీడని ఉత్కంఠ
- మంత్రి వివేక్ వర్సెస్ బాల్క సుమన్
- మళ్ళీ వాయిదా పడ్డ క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- పోలీసులు, బిఆర్ఎస్, సిపిఐ కార్యకర్తలకు మధ్య తోపులాట
- మంత్రి వివేక్, బాల్క సుమన్ ఒకరిపై మరొకరు విమర్శలు





**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం హైడ్రామా కొనసాగింది. క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించేందుకు అధికారులు మున్సిపల్ కార్యాలయాన్ని పూలతో, పూల దండలతో సుందరంగా తీర్చి దిద్దడంలో సక్సెస్ అయిన అధికారులు ఎన్నిక నిర్వహణలో దారుణంగా విఫలమయ్యారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారం, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించాలని మందమర్రి ఎంఆర్ఓ సతీష్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. సోమవారం వాయిదా పడిన ఎన్నిక మంగళవారం నిర్వహించడానికి నోటీసులు జారీ చేసి, ఉదయం 11 గంటలకు సభ్యులు హాజరు కావాలని సమయం విధించారు. క్యాతన్ పల్లి మున్సిపల్ అబ్జర్వర్‌గా పొన్నం ప్రభాకర్‌ను నియమించారు. కాంగ్రెస్ పార్టీ నుండి కేవలం 7గురు కౌన్సిలర్‌లు గెలుపొందారని, కాంగ్రెస్ పార్టీ కి కోరం లేదని ప్రభాకర్ రాకపోవడం గమనర్హం. ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవా లక్ష్మి క్యాతన్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్‌గా నియమించబడిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ, సీపిఐ పార్టీ కౌన్సిలర్ లకు మద్దతుగా విచ్చేసింది. అసిఫాబాద్, ఎం.ఎల్.ఏ కోవా లక్ష్మి బాల్క సుమన్‌లు 10 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్‌లను, సీపిఐ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కలవేన శంకర్, రామడుగు లక్ష్మణ్‌లు 4గురు సీపిఐ కౌన్సిలర్‌లను తీసుకుని క్యాతన్ పల్లి మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్తుండగా ఆర్‌ఓబి ఫ్లై ఓవర్ వద్ద అడ్డుకొని, కౌన్సిలర్‌లను మాత్రమే అనుమతించారు. అనంతరం మంత్రి వివేక్, ఎం.పి వంశీ కృష్ణ లు 8 మంది కౌన్సిలర్ లను తీసుకుని కాన్వాయ్‌గా బయలు దేరి ఆర్‌ఓబి ఫ్లై ఓవర్ వద్దకు చేరుకోగానే పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్,పార్టీ శ్రేణులు బి.ఆర్.ఎస్,సీ.పి.ఐ పార్టీ శ్రేణుల మధ్య తోపులాట జరగగా పోలీసుల పై రాళ్ల రువ్వారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కు తలకు తీవ్ర గాయలయ్యాయి, ఒకటి రెండు వాహనాల అద్దాలు బద్దలయ్యాయి. గుంపు గా ఉన్న ఇరు వర్గాలను చెదర కొట్టడానికి పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో క్యాతన్‌పల్లిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది.

## పుర ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా

## మంత్రి వివేక్, మాజీ విప్ బాల్క సుమన్...

మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి చెన్నూరు నియోజకవర్గాకనికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వివేక్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ లు చెన్నూర్ మున్సిపాలిటీ, క్యాతన్ పల్లి మున్సిపాలిటీలను కైవసం చేసుకోడానికి ఎత్తులు పై ఎత్తులు వేశారు. చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులలో,కాంగ్రెస్ పార్టీ,బి.ఆర్.ఎస్ అభ్యర్థులను, క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో 22 వార్డులలో కాంగ్రెస్ పార్టీ 22 వార్డులలో బిఆర్ఎస్ 15 వార్డులలో, బిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్న సీపిఐ పార్టీ 7 వార్డులలో పోటీ చేశాయి. ఈ నెల 11న పోలింగ్ జరగగా, 13న ఫలితాలు వెలువడ్డాయి. చెన్నూర్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని 22 వార్డులకు 7+సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగా, 14 సీట్లు సాధించి బి.ఆర్ఎస్, సీపిఐ కూటమి కైవసం చేసుకొంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇరు పార్టీల నాయకులు తమ కౌన్సిలర్‌ను క్యాంపులకు తరలించి ,కౌన్సిల్ సమావేశానికి తీసుకొచ్చారు. సంఖ్యా బలం ఉన్న బిఆర్ఎస్, సీపిఐల కూటమి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కించుకోవదాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు గెలిచిన 7గురు కౌన్సిలర్‌తో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థి ని కాంగ్రెస్ పార్టీ లో చేర్చుకోవడం తో వారి సంఖ్య 8 కి చేరుకుంది, మంత్రి, ఎంపిల ఎక్స్‌అఫిషియో ఓట్లు కలిపిన 10కి ఓట్ల సంఖ్య చేరుకుంది. అయినప్పటికీ చైర్మన్ ఎన్నికకు 3 ఓట్లు తక్కువ అయ్యాయి. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్, సీపిఐ కూటమి నుంచి నలుగురు కౌన్సిలర్‌లను లాగేసుకునే కుటిల ప్రయత్నం చేసి విఫలం అయ్యారు.

## క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో దృశ్యాసన పర్వం

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో దృశ్యాసన పర్వం మొదలయిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెప్పుకొచ్చారు. నూతనంగా గెలిచిన తమ బీఆర్ఎస్,సీపీఐ కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నుకునే సభలో కాంగ్రెస్ కౌన్సిలర్లు గందరగోళం సృష్టించడం దూరదృష్టకరం అన్నారు.కౌరవులను తలపించే లాగా తమ బీఆర్ఎస్, సీపీఐ మహిళ కౌన్సిలర్లపై అధికార పార్టీ కౌన్సిలర్లు దాడికి దిగిన మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ చూస్తూ ఉన్నారు తప్ప ఆపలేదని అన్నారు.మహిళ కౌన్సిలర్ల పై దాడికి దిగడం కాంగ్రెస్ ప్రభుత్వనికి సిగ్గుచేటన్నారు. ఈ దాడులను నిరసిస్తూ బాల్క సుమన్ బుధవారం రోజు బీఆర్ఎస్,సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బంధుకు పిలుపునిచ్చారు.అధికార కాంగ్రెస్ ప్రభుత్వం,మంత్రి వివేక్ వెంకటస్వామి,ఎంపీలు ఇకనైనా ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హితవు పలికారు.

---

## కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కుమ్రం భీం ఆసిఫాబాద్,ఆదిలాబాద్ జిల్లా ఎస్పీలు

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 17 , ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ నితికా పంత్,ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అచల్ మహాజన్ మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ బందోబస్త్‌ను వారు కలిసి పర్యవేక్షించారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం, ఇతర ముఖ్యమైన స్థలాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నటు వారు తెలిపారు. వారి వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్, సీఐలు ఉన్నారు.

### కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలు : జిల్లా ఎస్పీ నితిక పంత్

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంకు 200 మీ పరిధిలో ముగ్గురి కంటే ఎక్కువ మంది గుమిగూడితే 144 సెక్షన్ అమలు, చట్టం ను ఉల్లంగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ముగ్గిరి కంటే ఎక్కువ మంది వ్యక్తులు ఎలాంటి ప్రైవేట్ లేదా పబ్లిక్ ప్రదేశాల్లో గుంపులుగా చేరరాదని స్పష్టం చేశారు. అనుమతి లేని వాహన ర్యాలీలు, టూర్ వాహనాలు లేదా ఇతర రవాణా సదుపాయాల ద్వారా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘించే విధంగా సంచారం చేయడం నిషేధించబడిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధుల నివాసాల వద్ద ఎలాంటి ఆందోళనలకు అనుమతి లేదని, ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు అందరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించి, పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## యుఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రం విడుదల

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం అనే లక్ష్యంతో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రాన్ని లక్షెట్టిపేట మండల విద్యాశాఖ అధికారి శైలజ, మిట్టపల్లి తిరుపతి కలిసి అధికారికంగా విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రశ్న పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి శైలజ మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చిన్న వయసు నుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి టాలెంట్ టెస్ట్ పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, వారి సామర్థ్యాన్ని గుర్తించడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తనలో ఉన్న ప్రతిభను గుర్తించి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం యుఎస్‌ఎఫ్‌ఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే యుఎస్‌ఎఫ్‌ఐ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను యుఎస్‌ఎఫ్‌ఐ ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని, విద్యార్థుల హక్కుల పరిరక్షణే సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి పెరిగి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు మెరుగవుతాయని అన్నారు.

## ప్రశాంతంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**- జిల్లా ఎన్నికల అధికారి కె.హరిత**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె హరిత అన్నారు. మంగళవారం సమీకృత కలెక్ట రేట్ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో కాగజ్ నగర్ మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ మున్సిపాలిటి, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలి

**జన్నారం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

పదో తరగతి విద్యార్థులు సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ అన్నారు. జన్నారం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అలాగే గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ సందర్శించి పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు ఏ విధంగా ప్రిపేర్ కావాలి, పరీక్షలకు వెళ్ళే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు, సరైన నిద్ర మంచి ఆహారం ,యోగ, మెడిటేషన్ మానసిక ఒత్తిడి నివారించవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ఫలితాలు ఏ విధంగా వచ్చిన సానుకూల దృక్పథంతో ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు.అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాల స్టోర్ రూమ్, భోజనశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజం, హెల్త్ సూపర్వైజర్ జంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పి పల్లవి, హెల్త్ అసిస్టెంట్ లు కొల్లూరి కమలాకర్,ఎండి రషీద్ ఖాన్, సుభక్త, గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తాం: మేయర్ ధర్ని మధుకర్

### మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నస్పూర్ పద్మశాలి సంఘం ప్రతినిధులు

**నస్పూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



కార్పొరేషన్ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమానికి, పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్ అన్నారు. మంగళవారం తన నివాసంలో నస్పూర్ పద్మశాలి సంఘం, మార్కండేయ దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ధర్ని మధుకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 9వ డివిజన్ కార్పొరేటర్ సురిమిళ్ల సౌమ్య వేణును సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. పట్టణ సమస్యల పరిష్కారానికి, కుల సంఘాల అభివృద్ధికి సహకరించాలని మేయర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలగాని బొడ్డయ్య, మార్కండేయ దేవాలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం రామన్న, సభ్యులు మెండ వెంకన్న, చిప్ప రాజబాబు, కుందారపు రమేష్, తౌటం మల్లేష్, సబ్బని భాస్కర్, కన్నం సాంబయ్య, కుందారపు రాములు, క్యాతం రాజేష్, కుసుమ శంకర్, పాటేటి శంకర్, ఆడేటి రాజన్న, కొండి శంకర్, కుంట రామన్న, అన్నం వెంకటేష్, ఆడేటి మోహన్, కటకం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.